సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 23 । డిసెంబర్ । 2024



కోడీ.. రెఢీ'

సంక్రాంతి బరిలో 'తగ్గేదేలే'.. అంటూ పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు. శిక్షణా శిబిరాల్లో కోడి పుంజులతో కఠోర సాధన చేయిస్తున్నారు. 8లో



గోల్డ్ నిందితుడు అరెస్టు!

పెద్ద మొత్తంలో బంగారం, వెండి, వజ్రాలతో ఉడాయించిన గూడెం పట్టణానికి చెందిన బంగారం వ్యాపారి పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం 8లో



మూగజీవాలపై ప్రేమ

మూగజీవాల పోషణపై ఆసక్తి నానాటికీ తగ్గుతోంది. అలాంటిది 116 జీవాలను సాకుతున్నారు కైకలూరుకు చెందిన ఆక్వా రైతు దండు రంగరాజు. 8లో

న్యూస్‌రీల్

ఇరాక్‌లో జగన్ పుట్టినరోజు వేడుకలు



ఇరాక్‌లో కేక్ కట్ చేస్తున్న జగన్ అభిమానులు

తాడేపల్లిగూడెం : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన జగన్ అభిమానులు ఇరాక్‌లో ఘనంగా జరిపారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామానికి చెందిన తాడేపల్లి శివ ఆధ్వర్యంలో 20 కిలోల భారీ కేక్ కట్ చేసి జగన్ పట్ల అభిమానం చాటుకున్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి అవార్డు

తాడేపల్లిగూడెం : ఉద్యాన, వ్యవసాయ రంగాల్లో 35 సంవత్సరాలుగా చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్‌కు అవార్డు దక్కింది. బెంగళూరులో ఇన్‌సెక్ట్ ఎన్విరాన్‌మెంటు జర్నల్, రష్వీ ఇంటర్నేషనల్ ఫైటోసానిటరీ రీసెర్చ్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో అబ్రహం వర్గీస్ ఇన్‌సెక్ట్ నేచర్ ట్రస్టు ఈ అవార్డును వీసీకి ప్రధాన చేసింది. తీపి నారింజ, ఉల్లి, పసుపు, పులుపు నిమ్మ, సుగంధ ద్రవ్యాలలో అత్యుత్తమ సేవలకు వీసీకి అత్యుత్తమ మొక్కల రక్షణ 2024 అవార్డు వచ్చింది.

ట్రిపుల్ ఐటీలో గణిత దినోత్సవం



నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రొఫెసర్ నరసింహారెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపక సిబ్బంది

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణితం హెచ్‌ఓడీ సీహెచ్ సుబ్బారెడ్డి నేతృత్వంలో స్టూడెంట్ మిత్ర సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్ వై.నరసింహారెడ్డి పాల్గొని గణిత ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. అన్ని శాస్త్రాలకు గణితమే మూలమన్నారు. గణితంలో రాణిస్తే అన్ని శాస్త్రాల్లో రాణించడం సులువవుతుందన్నారు. అనంతరం నిర్వహించిన గ్రాండ్ మాస్టర్, మ్యాథ్స్ స్క్వేర్ పోటీల్లో విజేతలకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాచర వెర్రియ్యనాయుడు, రాజేష్ బండారి రూపొందించిన మ్యాథ్స్ రేసర్ అనే వెబ్ అప్లికేషన్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏట బీ లక్ష్మణరావు, డీన్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యమే రాజ్యాంగానికి రక్షణ కవచం



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

తణుకు అర్బన్: రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన పాలకులే రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని, రాజ్యాంగానికి రక్షకులుగా ఉండాల్సిన న్యాయమూర్తులు దానికి విరుద్ధంగా తీర్పులు ఇస్తున్న పరిస్థితుల్లో పౌరసమాజ సంస్థలు కల్పించే ప్రజా చైతన్యమే రాజ్యాంగానికి రక్షణ కవచమని మాజీ పార్లమెంటు సభ్యులు, రాజ్యాంగ పరిరక్షణ వేదిక వ్యవస్థాపకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు స్పష్టం చేశారు. తణుకు రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయకర్త డీవీవీయస్ వర్మ అధ్యక్షతన ఆదివారం స్థానిక సురాజ్య భవన్‌లో నిర్వహించిన పౌర సంస్థల, ప్రజాసంఘాల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని పౌర సంస్థలకు, ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేశారు. విశ్రాంత ఐఏఎస్ బండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా రిపబ్లిక్ భావన ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. సంధానకర్తలుగా ఏఐటీయుసి నాయకులు కోనాల భీమారావు, సీఐటీయు నాయకులు పీవీ ప్రతాప్, సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపకుడు పి.మురళీకుమార్, వివిధ రంగాల ప్రముఖులు డా.గుబ్బల తమ్మయ్య, ఎస్.మనోరమ, డా.రమేష్ వ్యవహరించారు. అడబాల లక్ష్మీ, డి.సోమసుందర్, డా.జి.అబ్బయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ పాల్గొన్నారు .

జీతాల్లేవు.. అప్పులే దిక్కు

- 7 నెలలుగా కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు అందని జీతాలు
- ఒక్కొక్కరికి రూ.60 వేల నుంచి రూ.70 వేల బకాయిలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో జీతాలు పెంచి సకాలంలో అందించిన వైనం

ఒకట్రెండు నెలలు జీతం రాకపోతే అల్లాడిపోతాం. అలాంటిది ప్రభుత్వాసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు(కాంట్రాక్ట్) గత 7 నెలలుగా జీతాలు లేవు. దీంతో అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఇప్పుడు ఆ అప్పులు కూడా పుట్టని పరిస్థితి. ప్రభుత్వాసుపత్రుల్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో వీరు ఎంతో కీలకం. అలాంటి కార్మికులకు ఈ ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించకుండా గత 7 నెలలుగా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ 7 నెలల కాలంలో ఒక్కొక్కరికి రూ.66 వేల నుంచి 70 వేల జీతాలు బకాయిలు పెట్టారు.



భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

భీమవరం (ప్రకాశంచౌక్) : పారిశుద్ధ్య కార్మికులుగా ఆసుపత్రిలో పనిచేస్తున్నప్పటికీ నెలల తరబడి జీతాలు రాకపోయే సరికి కుటుంబ పోషణ, ఇంటి అద్దెల కోసం అప్పులు చేస్తున్నారు. నెలకు అసలు జీతం రూ.16 వేలు కాగా మినహాయింపులు పోను రూ.11,850 వారి చేతికి వస్తుంది. పీఎఫ్ కోసం వారి జీతం నుంచి మినహాయించిన సొమ్మును కూడా పీఎఫ్ ఖాతాకు జమ చేయకపోవడం దారుణం. ఇన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ జీతం వస్తుందనే ఆశతో కార్మికులు విధులకు హాజరై ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచే పనులు చేస్తున్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి పారిశుద్ధ్య కార్మికులు పడుతున్న కష్టాలు పట్టడం లేదు. జీతాల కోసం ఎవరిని అడగాలో తెలియక ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

జిల్లాలో సుమారు 70 మంది కార్మికులు

పశ్చిమ గోదావరి జిల్లాలో 4 ఏరియా ఆసుపత్రులు, ఒక జిల్లా ఆసుపత్రి, పెనుగొండ, ఆచంట, ఆకివీడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు కలుపుకొని మొత్తం 8 పెద్దాసుపత్రులు ఉన్నాయి. వాటిలో 70 మంది వరకూ పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, తాడేపల్లిగూడెం, తణుకు ఆస్పత్రిలో ఉండాల్సిన పారిశుద్ధ్య కార్మికులకంటే 10 శాతం తక్కువ మంది కార్మికులు పనిచేస్తున్నారు. దాంతో పనిభారం ఎక్కువగా ఉంది. దానికి తోడు ఆసుపత్రి అధికారుల, వైద్యుల వేధింపులను భరిస్తున్నారు.

గత ప్రభుత్వంలో పెరిగిన జీతాలు

గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచి ఆదుకున్నారు. అప్పటి వరకూ రూ.6 వేలు ఉన్న జీతాన్ని రూ.16 వేలకు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెంచారు. ఆయన జీతాలు పెంచడమే గాకుండా కాంట్రాక్టర్ల ద్వారా క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు అందించారు.

7 నెలల నుంచి జీతాలు లేవు



మాకు గత 7 నెలలుగా జీతాలు లేవు. దాంతో బతుకు దెరువుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పని చేస్తున్నాం కాని జీతాలు రాకపోవడంతో ఎలా బతకాలో తెలియడం లేదు. ఇప్పటికే ఒక్కొక్కరికి రూ.66 వేలు జీతం బకాయి ఉంది. ఎప్పటికి జీతాలు చెల్లిస్తారో తెలియని పరిస్థితిలో ఉన్నాం. మా గురించి పట్టించుకునే అధికారే లేదు. ఇలాగైతే మేం ఎలా బతకగలం. వెంటనే మా బకాయిలు చెల్లించాలి.

– ఎం.మంగ, పారిశుద్ధ్య కార్మికురాలు

అప్పులు చేసి బతుకుతున్నాం



ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న మాకు సకాలంలో జీతాలు రాకపోవడంతో అప్పులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. గతంలో నెల నెలా మాకు జీతాలు అందేవి. గత ఏడు నెలలుగా జీతాలు పెడింగ్‌లో పెట్టారు. పేద, మధ్య తరగతికి చెందిన మేం ఈ జీతాల మీదే ఆధారపడి బతుకుతున్నాం. అలాంటిది మాకు జీతాలు నిలుపుదల చేస్తే ఎలా కుటుంబాలను పోషించుకోవాలి. ప్రభుత్వం వెంటనే మా బకాయిలు చెల్లించాలి.

– యు.దుర్గ, పారిశుద్ధ్య కార్మికురాలు

క్రీస్తు మార్గం అనుసరించాలి



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ఏసు క్రీస్తు ప్రేమ, దయ, గుణాలు ప్రజలందరి జీవితాలకు మార్గదర్శకమని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం జిల్లా క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం విష్ణు కాలేజీ మిని ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీస్తు మార్గం అనుసరణీయమన్నారు. ప్రజల కొరకు ఆయన ప్రాణ త్యాగం చేశారని, ప్రపంచ దేశాలన్నీ ఆయనను అనుకరిస్తున్నాయన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మానవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా తోడ్పాటు అందించాలన్నారు. జిల్లా ఎస్పీ సతీమణి హీనా, కుమారుడు హంజహ్ తదితరులు క్రిస్మస్ కేకు కట్ చేశారు. ఫాదర్ స్టాలిన్, రెవరెండ్ ప్రతాప్ వాక్య సందేశాన్ని ఇచ్చారు. విష్ణు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్రైస్తవ గీతాలు పాడి వినిపించారు. కార్యక్రమంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, క్రిస్టియన్, ముస్లిం మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎస్ఎస్ కృపావరం, మైనార్టీ వెల్ఫేర్ అధికారి శేషుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



వీరవాసరం మండల కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాద రాజు, చిత్రంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి

వీరవాసరం : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు భరోసానిచ్చారు. వీరవాసరం మండలం నౌదూరు జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన మండల విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేసిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రమేనని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజల తరఫున పోరాటం చేయడానికి పార్టీ ఎప్పుడు ముందుంటుందన్నారు. పార్టీకి ప్రజలంతా ఎప్పుడు అండగా ఉంటారని వారి అభిమానం ఎప్పుడూ జగన్‌మోహన్ రెడ్డిపైనే ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో 300 పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, భీమవరం జెడ్పీటీసీ కాండ్రేకుల నరసింహారావు, భీమవరం ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, వైఎస్ఆర్‌సీపీ భీమవరం పట్టణ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, రూరల్ అధ్యక్షుడు జెల్లా కొండయ్య, పార్టీ సీనియర్ నాయకులు చినిమిలి వెంకట్రాయుడు, కామన నాగేశ్వరరావు, రాయిపోలు శ్రీనివాసమూర్తి, పెనుమాల నరసింహస్వామి, కోడే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

తేలని పార్శిల్ శవం కేసు

ఉండి: ఉండి మండలం యండగండి పార్శిల్ శవం కేసు ఇంకా కొలిక్కి రాలేదు. ఈ ఘటనపై ఐజీ ప్రత్యేకంగా దృష్టి పెట్టడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. ఈ నెల 20న ముదునూరి రంగరాజు ఇంటికి పార్శిల్‌లో శవం రావడంతో అంతా ఉలిక్కిపడ్డారు. అప్పటి నుంచి పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసినా ఇంకా కీలకమైన ప్రశ్నలకు సమాధానాలు దొరకలేదు. ముదునూరి రంగరాజు భార్య, కుమార్తెలను దర్యాప్తులో భాగంగా ప్రశ్నిస్తున్నారు. చిన్న కుమార్తె అత్తింటివారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రధాన అనుమానితుడిగా ఉన్న చిన్నల్లుడి ఆచూకీ కోసం నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ఈ కేసు దర్యాప్తును పోలీస్ ఐజీ అశోక్‌కుమార్ పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. దీనిలో భాగంగా ఆదివారం ఏలూరు నుంచి యండగండి మీదుగా భీమవరం చేరుకుని కేసు పురోగతిపై ఆరా తీసినట్లు తెలుస్తుంది. కారులో యండగండి మీదుగా వెళ్తూ గ్రామ పరిధిలో మెయిన్‌రోడ్డుపై ఉన్న సీసీ కెమెరాలను కారులో నుంచే పరిశీలించినట్లు తెలిసింది. ఘటనా స్థలికి చేరుకుంటారని మొదట భావించినా యండగండిలో ఐజీ ఆగకుండా భీమవరం వెళ్లి పోలీసులను ఈ కేసుపై ఆరా తీసినట్లు సమాచారం. ఐజీ రంగంలోకి దిగడంతో పోలీసులు మరింత అప్రమత్తమై అనుమానితుడి ఆచూకీ కోసం పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపడుతున్నారు. అనుమానితుడు దొరికితేనే గాని పార్శిల్‌లో వచ్చిన శవం ఎవరిది ,మృతుడు ఏ ప్రాంతానికి చెందిన వాడు? అనే వివరాలు తెలియవు. ఇప్పటికే పోలీసుల అదుపులో కొందరు అనుమానితులు ఉన్నట్లు తెలుస్తుంది. త్వరలోనే పోలీసులు ప్రెస్‌మీట్ పెట్టి కేసుకు సంబంధించిన కీలక వివరాలు చెబుతారని సమాచారం.

ఆచూకీ తెలిస్తే సమాచారం అందించండి

భీమవరం (ప్రకాశంచౌక్) : మృతదేహం ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు ఒక ప్రకటనలో కోరారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుంది. ఎత్తు 5.8 అడుగులు. మృతుడి ఒంటిపై పొడుగు చేతుల నలుపు రంగు స్వెటర్, ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నలుపు రంగు కట్ చేసిన పాంటు ఉంది. ఈ నెల 16, 17 తేదీల్లో చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ నెలలో ఎవరైనా 30–40 ఏళ్ల వయసున్న వారు అదృశ్యమైతే వారి వివరాలు 9154966497, 9440796648, 9154966508 నెంబర్లకు అందించాలని కోరారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



పెనుమంత్రలో మాట్లాడుతున్న జిల్లా నాలుగో అదనపు జడ్జి డి.సత్యవతి

పెనుమంత్ర: మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించినప్పుడే నేరాలు సంఖ్య తగ్గుతుందని జిల్లా నాలుగో అదనపు జడ్జి డి.సత్యవతి అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో పెనుమంత్ర, ఇరగవరం మండలాలకు చెందిన ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలు, డ్వాక్రా మహిళలతో విధాన్ సమాధాన్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ మహిళా విభాగాలకు చెందిన ఉద్యోగులంతా సమన్వయంతో పని చేస్తూ.. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయి రాం, రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏవి నాగరాజు, స్పెషల్ క్లాస్ మేజిస్ట్రేట్ టీవీ చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు.

బీడు.. పోగొండ గోడు

- పంట కాల్వల్లో పారని నీరు
- అసంపూర్తిగా పోగొండ రిజర్వాయర్ పనులు
- పనులు పూర్తి చేసి నీరు అందించాలంటున్న 13 గ్రామాల రైతులు



పిచ్చిమొక్కలతో పోగొండ రిజర్వాయర్ ఎడమకాల్వ

బుట్టాయగూడెం: పోగొండ రిజర్వాయర్‌తో రైతుల ఆశలు నెరవేరలేదు. పాలకుల నిర్లక్ష్యంతో రైతుల పంటకు నీరందని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చెప్పిన దానికి క్షేత్రస్థాయిలో జరిగే పనులకు పొంతన ఉండటంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుట్టాయగూడెం మండలం చింతలగూడెం సమీపంలో పోగొండ రిజర్వాయర్ నిర్మాణానికి 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా రూ.26.02 కోట్ల నిధులను విడుదల చేశారు. పనులకు శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ మరణం తర్వాత పనులు మందకొడిగా సాగాయి. అధికారులు పనులకు సంబంధించి అంచనాలు వేయడంతో 2014లో రూ.85.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. పదేళ్లపాటు కొనసాగిన ఈ పనులకు సుమారు రూ.129.50 కోట్లకు ప్రాజెక్టు వ్యయం పెరిగింది. పూర్తి స్థాయిలో పనులు జరగకుండానే 2018 ఫిబ్రవరి 19న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా హడావుడిగా ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. కనీసం భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం కూడా అందించలేదని రైతులు విమర్శిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు పరిహారం విషయంలో, పూర్తి స్థాయిలో పనులపై కనీసం నోరు మెదపడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

7,600 ఎకరాలకు నీరందేలా లక్ష్యం

పోగొండ రిజర్వాయర్ ద్వారా బుట్టాయగూడెం మండలంలోని రాచూరు, లంకాలపల్లి, కుమ్మరిగుంట, లక్ష్మడుగూడెం, రామన్నగూడెం గ్రామాల్లో సుమారు 4,000 ఎకరాల బీడు భూములకు సాగు నీరు అందించాలన్నదే లక్ష్యం. వీటితోపాటు కొయ్యలగూడెం మండలంలోని 3,600 ఎకరాలకు స్థిరీకరణ ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది.

పూర్తికాని పంట కాల్వలు

ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యి ఆరేళ్లు గడుస్తున్నా పంట కాల్వల పనులు నేటికీ పూర్తి కాలేదు. కుడి కాల్వ పరిధిలో 5 గ్రామాల పరిధిలో 1000 ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలో 500 ఎకరాలు సాగునీరు అందించేందుకు పంట కాల్వలు నేటికీ పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. దీనితో ఆయా గ్రామాల పరిధిలో సుమారు 1500 ఎకరాలకు సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు. ఆయా గ్రామాల పరిధిలో పంట కాల్వల ఏర్పాటుకు భూమిని కోల్పోయిన 1400 మంది రైతులకు పరిహారం కూడా చెల్లించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికై న పరిహారం చెల్లించడంతోపాటు పంట కాల్వలు పూర్తి చేసి తమ పొలాలకు సాగు నీరు అందించేలా కృషి చేయాలని పోగొండ రైతులు కోరుతున్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



పోగొండ రిజర్వాయర్‌లో పంట కాల్వలకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు కూటమి ప్రభుత్వం పరిహారం చెల్లించేలా కృషి చేయాలి. నాడు ప్రాజెక్టు హడావుడిగా ప్రారంభించారు. ఆ సమయంలో నిర్వాసితులందరూ చంద్రబాబు దృష్టికి సమస్యలను తీసుకువెళ్లాం. కనీసం పట్టించుకోలేదు. ఇప్పటికైనా పరిహారం ఇప్పించడంతోపాటు పంట కాల్వను పూర్తి చేసేలా కృషి చేయాలి.

– బన్నే బుచ్చిరాజు, సర్పంచ్, నిమ్మలగూడెం, బుట్టాయగూడెం మండలం

త్వరలోనే పనులు ప్రారంభించేలా కృషి



పంట కాల్వలు పూర్తి స్థాయిలో పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నాం. నిర్వాసితులకు పరిహారం కొంత చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– టి.సురేష్, ఏఈ, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

ఉంగుటూరు : విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ చేబ్రోలులో సీపీఎం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఈ మేరకు విద్యుత్ బిల్లులను తగులపెట్టారు. మండల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు నారపల్లి రమణరావు మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉండగా స్మార్టు మీటర్లు రద్దుచేయాలని చెప్పిందని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు పెట్టాలని నిర్ణయించడం దారుణమన్నారు.

క్లుప్తంగా

ఎక్సైజ్ దాడులు


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని బుద్ధుల వారిగూడెం సమీపంలోని పంట కాల్వలో నాటుసారా స్థావరాలపై పోలవరం ఎక్సైజ్ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో సుమారు 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం తెలిపారు. ఎస్సై జి.సునీల్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి: నాటు సారా తయారీ కేంద్రాలపై దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్సై మస్తానరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పోతనపల్లి శివారు తోటల్లో నాటు సారా తయారీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి 20 లీటర్ల సారాను, బైక్‌ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సారా తయారీదారుడు దారావతు కుమార్‌ని అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించామన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సీఐ కాళీచరణ్


భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం బలుసుమూడిలో కొన్ని నెలల క్రితం జరిగిన చోరీ కేసులో నిందితుడు వీరవల్లి కృష్ణమోహన్‌ పోలీసులు అరెస్ట్ చేసి అతడి నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. టూటౌన్ సీఐ కాళీచరణ్ ఆదివారం వివరాలు వెల్లడించారు. భీమవరం బలుసుమూడిలో పాతర్లపల్లి మాలతి అనే మహిళ ఇంట్లో జూన్ 4వ తేదీన రాత్రి చోరీ జరిగింది. ఆమె ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.1.50 లక్షలు, 18 కాసుల బంగారు ఆభరణాలు అపహరించారు. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు ఆమెతో సన్నిహితంగా ఉండే ఎల్‌వీఎన్ పురం గ్రామానికి చెందిన వీరవల్లి కృష్ణమోహన్ ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. క్రికెట్ బెట్టింగ్, ఇతర జూదాలకు అలవాటు పడిన కృష్ణమోహన్ దొంగలించిన డబ్బులు వ్యసనాలకు వాడుకోగా బంగారాన్ని విక్రయించేందుకు శనివారం రాత్రి భీమవరం వచ్చాడు. భీమవరం పాత బస్టాండ్ వద్ద ఉన్న నిందితుడిని గుర్తించిన ఎస్సై రెహమాన్ అరెస్ట్ చేసి, అతడి నుంచి 18 కాసుల బంగారం రికవరీ చేశారు. ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందికి ఎస్పీ నయీమ్ అస్మిన్ నగదు అవార్డు ప్రకటించినట్లు సీఐ కాళీచరణ్ తెలిపారు.

● ఇంటింటా నీరాజనం



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చినవెంకన్న దివ్య క్షేత్రంలో నిర్వహించిన తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, గజ, అశ్వ సేవల నడుమ తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులకు కన్నులపండువగా తిరువీధి సేవను జరిపారు. తమ ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు పూజాధికాలు నిర్వహించి, నీరాజనాలు సమర్పించారు. – ద్వారకాతిరుమల

● వన దేవతకు వందనం



బుట్టాయగూడెం మండలంలోని కావవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ తల్లి గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నట్లు ఆలయ కమిటీ నాయకులు, సర్పంచ్ కోర్స గంగరాజు తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – బుట్టాయగూడెం

● సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైక్లింగ్ వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ ఏలూరు స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా సెంటర్ (సాయ్) ఆధ్వర్యంలో క్రీడాకారులు, విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పెద్దలు, పిల్లలు సైకిల్ తొక్కేందుకు ప్రాధాన్యతా ఇవ్వాలని, దీనివలన పర్యావరణానికి మేలు చేసినవారవుతారని ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి డి ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సాయ్ ఇన్‌చార్జి డీఎన్‌వీ వినాయక ప్రసాద్, కోచ్‌లు ప్రీతిచౌదరి, శుబుంగి పాల్గొన్నారు. – ఏలూరు రూరల్

కోడీ.. రెఢీ

- సంక్రాంతికి సిద్ధమవుతున్న పందెం కోళ్లు
- రెండు పూటలా వాకింగ్, ఒక పూట స్విమ్మింగ్
- కోడిగుడ్డు, బాదం, పిస్తా పప్పులు, మాంసం మెనూ
- పందెం కోడి ధర రూ.10 వేల నుంచి రూ. లక్షకు పైగా..


ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంటలో శిక్షణలో భాగంగా తలపడుతున్న పందెం కోళ్లు

ద్వారకాతిరుమల: సంక్రాంతి బరిలో 'తగ్గేదేలే'.. అంటూ పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు వాటి పెంపకందారులు. అందులో భాగంగా శిక్షణా శిబిరాల్లో కోడి పుంజులతో కఠోర సాధన చేయిస్తున్నారు. పండుగ సమయం దగ్గరపడుతున్న కొద్దీ వర్కవుట్స్ పెంచుతున్నారు. రోజుల్లో దాదాపు 14 గంటల సమయం కండలు పెంచేందుకు కోడి పుంజులు శ్రమిస్తున్నాయి. పెంపకందారులు వాటిని చూసి మురిసిపోతూ, పందేల్లో పైచేయి సాధించేందుకు వాటిపై ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడటం లేదు. ఈ క్రమంలో వాటికందిస్తున్న మెనూ చూస్తే.. ఎవరికైనా కళ్లు చెదిరిపోవాల్సిందే.

కోడి పందేలకు గోదావరి జిల్లాలు పెట్టింది పేరు. ఇక్కడ సంక్రాంతి పండుగ అంటేనే.. పందేలు అన్నట్టుగా ఉంటుంది. ప్రతి ఏటా పండుగ మూడు రోజులు జరిగే కోడి పందాలను వీక్షించేందుకు ఇతర రాష్ట్రాల నుంచే కాదు, దేశ విదేశాల నుంచి గోదావరి జిల్లాలకు తరలివస్తారు. పందేల్లో డబ్బు సంపాదించాలని కొందరు, సత్తా చాటాలని, తమ టీవీ, దర్పాన్ని ప్రదర్శించాలని మరికొందరు తమ పుంజులను బరుల్లో దింపుతారు. అందులో భాగంగానే ఈ ఏడు కూడా పందేలను భారీగా నిర్వహించేందుకు పశ్చిమాన భీమవరం, పాలకొల్లు, నరసాపురం, గణపవరం, కోడూరు, వీరవాసరం, ఐ.భీమవరం, ద్వారకాతిరుమల, తణుకు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, కొవ్వూరు, ఉంగుటూరు, భీమడోలు తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో పందెం కోళ్లను పెంపకందారులు ప్రత్యేక శ్రద్ధతో పెంచుతున్నారు. పండుగకు మరో 20 రోజులు మాత్రమే సమయం ఉండటంతో హడావిడిగా ఉన్నారు.

శరీరం గట్టిపడేందుకు..

ఉదయాన్నే కోడి పుంజుల గొంతులో నీటిని పోసి, కఫం పోయేలా కళ్లి కొట్టడం, నోట్లో నీరు పోసుకుని ఊదడం, ఒంట్లోని కొవ్వును కరిగించేందుకు పొయ్యిపై అట్లపెణం పెట్టి, దానిపై నీరు చల్లి, ఆ నీటిని గుడ్డతో కోడి శరీరానికి రాస్తున్నారు. అలాగే కత్తిపోట్లు తట్టుకోవడానికి, ఒళ్లు గట్టిపడడానికి పసుపు, పిప్పళ్లు, వట్టివేర్లు, ఉక్కిసాయిలం, జామాయిల్ సీస, కుంకుళ్లు, 20 రకాల ఆకులతో మరగబెట్టిన నీటితో పోత పోస్తున్నారు. త్వరగా ఆరేందుకు గోనెల్లో చుట్టి ఎండలో పెడుతున్నారు. నీటిలో ఈదించడం, వాకింగ్ చేయించడం వంటివి చేస్తున్నారు.

బలవర్ధకమైన ఆహారం..

పోరుకు సిద్ధమవుతున్న కోడి పుంజులకు ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నారు. శరీరంలో కొవ్వు చేరకుండా ప్రత్యర్థి పుంజుపై విరుచుకుపడేందుకు, తేలిగ్గా ఎగిరేందుకు వాటికి బలమైన ఆహారాన్ని అందిస్తున్నారు. ఉదయాన్నే గోరువెచ్చని నీటిని పట్టించి వ్యాయామం చేయిస్తున్నారు. అనంతరం డ్రైఫ్రూట్ లడ్డూ, మటన్ కైమాను అందిస్తున్నారు. అలాగే కోడిగుడ్డు, ఎండు ఖర్జూరం, బాదం, పిస్తా పప్పులు పెడుతున్నారు. అదేవిధంగా నానబెట్టిన రాగులు, సోళ్లు, గంట్లు, మెరికలను అందిస్తున్నారు. మేత పెట్టే సమయంలో బయట వ్యక్తులను ఎవరినీ పుంజులను చూసేందుకు అనుమతించడం లేదు. పందెం పుంజును సిద్ధం చేసేందుకు మూడు నెలల్లో దాదాపు రూ. 25 వేల నుంచి రూ.30 వేలు ఖర్చు అవుతుందని పెంపకందారులు చెబుతున్నారు.


రాళ్లకుంటలోని ఒక తోటలో గాబుల్లో పందెం పుంజులు


బాదం పప్పు, నువ్వుల నూనెతో తయారు చేసిన తాటిబెల్లం ఉండలను తింటున్న పుంజు


నీటి తొట్టెలో ఈతకొడుతూ..


మూలికలు, ఆకులతో మరిగించిన నీటితో పోతపోస్తున్న దృశ్యం

ప్రత్యేక జాతి పుంజులు

పుంజుల్లో పచ్చ కాకి, అబ్రాసు, డేగ, సీతువ, కెక్కిరాయి, పెట్టమార్ డేగ, నెమలి, కోడి డేగ, నెమలి పింగలా, కోడి పింగలా ప్రత్యేక జాతులు. రంగును బట్టి ఏఏ సమయాల్లో పందెం గెలుస్తాయో తెలుసుకుని ఆ సమయాల్లో మాత్రమే వాటిని బరిలోకి దించుతారు.

బాక్సింగ్‌లో స్వర్ణ పతకం


గోల్డ్ మెడల్ సాధించిన సాయి వెంకట లవిత్ర

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో 85 నుంచి 90 కేజీల విభాగంలో సత్తా చాటి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు స్థానిక జువ్వలపాలెం 16వ వార్డుకు చెందిన 19 ఏళ్ల కొండపల్లి సాయి వెంకట లవిత్ర. రెండు రోజుల క్రితం పిఠాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈనెల 26న పంజాబ్‌లోని గురుకాశి యూనివర్సిటీలో జరిగే పోటీలకు, జనవరి 6 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. సాయి వెంకట లవిత్ర తండ్రి రాజేష్ ఆర్మీ కమాండర్ కావడంతో ఆయన ఉద్యోగ రీత్యా పంజాబ్ వెళ్లడంతో కుటుంబం అక్కడే స్థిరపడింది. ఈ సందర్భంగా లవిత్రను పలువురు అభినందించారు.

ఇద్దరు యువకులపై కేసు

ద్వారకాతిరుమల: విద్యార్థినులను వేధిస్తున్న ఇద్దరు యువకులపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం, వేంపాడు గ్రామానికి చెందిన యువకులు పెండ్లి సందీప్ కుమార్, జోనుబోయిన నాగ జితేంద్ర కొద్ది రోజులుగా పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థినులను వెంబడిస్తున్నారు. పాఠశాల ఆవరణలోని బాత్‌రూమ్‌లోకి వెళ్లే సమయంలో స్కూల్ పక్కనున్న చెట్లు ఎక్కి, సెల్‌ఫోన్‌లతో విద్యార్థినులను ఫొటోలు, వీడియోలు తీసి లైంగికంగా వేధిస్తున్నారు. దీనిపై విద్యార్థినుల నుంచి సమాచారం అందుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సిరిబత్తుల నవీన, మద్దాల రాజు, గుర్జుల సురేష్, గోటూరు అంబేద్కర్ ఈనెల 20న మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో పాఠశాల వద్దకు వెళ్లగా యువకుల ఆగడాలను నేరుగా గమనించారు. వెంటనే వారు ఉపాధ్యాయులతో కలసి యువకులను పట్టుకునేందుకు వెంబడించగా పరారయ్యారు. దీనిపై ఎస్ఎంసీ సభ్యులు ఫిర్యాదు చేయడంతో నిందితులపై పోక్సో తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుధీర్ తెలిపారు.

గేదెలను తరలిస్తున్న వాహనాల అడ్డగింత


పశు వధ కర్మాగారం వద్ద మూడు వాహనాల్లో ఉన్న పాడి గేదెలు


కర్మాగారం గేటు వద్ద మహిళల ఆందోళన

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలోని సత్యవాడ రోడ్డులో అక్రమంగా నిర్వహిస్తున్న పశు వధ కర్మాగారానికి ఆదివారం వచ్చిన పాడి గేదెల వాహనాలను గోసేవా సమితి నాయకులు, స్థానిక మహిళలు అడ్డుకున్నారు. 9 గేదెలు ఉన్న మూడు వాహనాలను కర్మాగారం లోపలకు వెళ్లనీయకుండా రెండు గంటలకుపైగా నిలువరించి నిరసన తెలిపారు. దీనిపై గోసేవా సమితి సభ్యులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఇరగవరం ఎస్సై జానా సతీష్ తమ సిబ్బందితో వచ్చి మూడు వాహనాలను రూరల్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదుచేసి పశువులను తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం చివటంలో ఉన్న గోశాలకు అప్పగించారు. వాహనాల్లో ఉన్న గేదెలన్నీ పాలిచ్చేవిగా బలిష్టంగానే ఉన్నాయని, అక్రమ మార్గంలో పాడి గేదెలను తీసుకువచ్చి కర్మాగారంలో విక్రయిస్తున్నారని గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నా, రోజూ వందల సంఖ్యలో పాడిగేదెలను చిత్రహింసలు పెట్టి చంపేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ తల్లి

పెదవేగి : భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచే కాక, సమీప జిల్లా వాసులు సైతం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ వారం అమ్మవారికి పూజా టికెట్లపై రూ.24,190, విరాళాలపై రూ.4,346, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.12,225, ఫొటోల విక్రయంపై రూ.1,295, మొత్తం ఆదాయం రూ.42,056 లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

పోలీసుల అదుపులో గోల్డ్ నిందితుడు!



తాడేపల్లిగూడెంలో మన్వి జ్యుయలర్స్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తాడేపల్లిగూడెం: విజయవాడ, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్టణంలో 12 మందికి పైగా జ్యుయలర్ దుకాణాల నుంచి పెద్ద మొత్తంలో బంగారం, వెండి, వజ్రాలు, తీసుకెళ్లి కనిపించకుండా పోయిన పట్టణానికి చెందిన బంగారం వ్యాపారి పట్టణ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. నిందితుని తాలూకా సామాజిక వర్గ పెద్ద ఒకరు నిందితుడిని శుక్రవారం రాత్రి పట్టణ పోలీసుల వద్ద సరెండర్ చేసినట్టు చెబుతున్నారు. ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా నిర్ధారించలేదు. ఈ నేపథ్యంలో నిందితునికి చెందినదిగా చెబుతున్న ఎన్టీఆర్ చౌక్ ఎదురుగా ఉన్న మన్వి జ్యుయలర్స్ దుకాణాన్ని ఆదివారం పట్టణ సీఐ పర్యవేక్షణలో మధ్యవర్తుల సమక్షంలో తాళాలు తెరిచి లోపల ఉన్న వస్తువులను పరిశీలించినట్టుగా సమాచారం. సోదాల అనంతరం దుకాణానికి పోలీసులు తాళాలు వేసేశారు. నిందితుని బంధువుల ఇళ్ల దగ్గర నుంచి సుమారు ఏడు కిలోలు బంగారు ఆభరణాలు, 250 కిలోలు వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. జిల్లా ఎస్పీ అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ విషయాన్ని బహిరంగంగా వెల్లడిస్తారని భావిస్తున్నారు.

మూగజీవాలపై ప్రేమ

- 116 జీవాలను సాకుతున్న రంగరాజు
- పోషణకు నెలకు రూ.1.20 లక్షల ఖర్చు


కైకలూరులో మేలు జాతి ఆవులు, గిత్తలతో రైతు రంగరాజు

కైకలూరు: మూగజీవాల పోషణపై ఆసక్తి నానాటికీ తగ్గుతోంది. రెండు మూగజీవాలను పెంచడానికే అవస్థలు పడుతున్న రోజులివి. అటువంటిది ఆవులు, గిత్తలు, మేకలు, కుక్కలు, బాతులు, కోళ్లు, కుందేళ్లు ఇలా దాదాపు 116 జీవాలను సాకుతున్నారు కైకలూరుకు చెందిన ఆక్వా రైతు దండు రంగరాజు. సొంత బిడ్డల్లా వీటిపై ప్రేమను చూపుతూ, కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు.

పోషణకు నెలకు రూ.1.20 లక్షల ఖర్చు

రంగరాజు చేపల చెరువులపై ఒంగోలు ఆవులు, గిరి ఆవులు, కాంక్రీజ్ ఆవు, తార్‌పార్కర్, గిరి గిత్త, పుంగనూరు గిత్త ఇలా 18 ఉన్నాయి. వీటిలో కేవలం 18 అంగుళాలు కలిగిన అరుదైన పుంగనూరు గిత్త ఉండటం విశేషం. అదే విధంగా కొల్‌కతాకు చెందిన పోతులు, మేకలు 5, కుందేళ్లు, 6, కొల్లేరు జాగిలాయి, మద్రాసు కుక్క, డాబర్‌మెన్ జాతులకు చెందిన 15 కుక్కలు, ఖజానా బాతులు, మెట్ట బాతులు, టర్కీ కోళ్లు, గిన్నే కోళ్లు కలిపి 16తో పాటు అడవి కోళ్లు, నాటు కోళ్లు కలిపి 56పైనే ఉన్నాయి. వీటి పోషణకు నెలకు రూ.1.20 లక్షలు ఖర్చు చేస్తున్నారు. మూగజీవాల పోషణ, ఆక్వా చెరువులపై ఇతర పనుల నిమిత్తం రంగరాజు 50 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రధానంగా ఒడిశా, అసోం రాష్ట్రాల నుంచి వలస కుటుంబాలు ఎక్కువగా చెరువు గట్లపై నివసిస్తున్నాయి.

సేంద్రియ పద్ధతుల్లో ఆకు, కూరగాయల పెంపకం

రసాయనాలు లేకుండా కేవలం సేంద్రియ పద్ధతుల్లో ఆకుకూరలు, కాయగూరలు, పాదులు, మొక్కలు సాగు చేస్తున్నారు రంగరాజు. పాదుల్లో మూడు రకాల బూడిద గుమ్మడి, బీర, పొట్ల, ఆనబా, కాకర, దొండ, ఎర్రచిక్కుడు అదే విధంగా తోటకూర, గోంగూర, వంకాయ, పచ్చిమిర్చి, టమాటా, బెండతో పాటు నారింజ, నిమ్మ, వాగు, ఉసిరి, ఇందిరా అరటి, కూర అరటి, చెక్కరకేళీ, కర్పూరంతో పాటు ఏడాది పాటు కాయలు కాసే మామిడి చెట్లను పెంచుతున్నారు.


సేంద్రియ పద్ధతిలో పొట్లపాదు పెంపకం


వివిధ రకాల కోళ్లు


మెట్ట బాతులు

క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



బీవీఆర్‌లో దివ్యాంగుల దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజమండ్రికు చెందిన దిశెట్టి హరిప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. దివ్యాంగుల చట్టం 2016పై అవగాహన కల్పించారు. పోటీలలో పాల్గొని విజేతలైన దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. పీసాస్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లాడి నటరాజ్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు కుందేటి జయరాజు, ఉపాధ్యక్షుడు ఎంపీ రాఘవేంద్రరెడ్డి, కొత్త వీర్రాజు, పులిమి లక్షణరావు, ఆమంచి నాని కోరసిక శ్రీనివాసరావు, ఏఎస్ భాను, టి.బాలాజీ, భవిత స్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎన్‌సీసీ విద్యార్థులు, దివ్యాంగులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్ సేవలు ఎనలేనివి



తణుకులో రాజగోపాల్ సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

తణుకు అర్బన్: ఇటీవల మృతిచెందిన ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి అయినపర్తి రాజగోపాల్ సంస్మరణ సభ ఆదివారం తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తిలో ఆయన సేవలు అభినందనీయమని, పదవీ విరమణ అనంతరం కూడా ఉపాధ్యాయ సమస్యలపై నిత్యపోరాటాలు చేశారని వక్తలు కొనియాడారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ మంజుల, రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్‌రాజు, పూర్వ అధ్యక్షులు పీఎస్‌వీ ప్రసాద్, ఎస్‌కే జిలాని, ఇరగవరం ఎంఈవో ఎస్.శ్రీనివాస్, కొండే నాగేశ్వరరావు, ఎస్‌వీ జాకబ్‌బాబు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



లూథరన్ సెంటినరీ చర్చిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెంటపాడు: గూడెం పట్టణంలో ఎ. క్లాస్ ప్యారిష్ సెంటినరీ లూథరన్ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆరాధన అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆవిష్కరించారు. చర్చి గురుమండల అధ్యక్షుడు డీఎల్ ఫీనెహాస్, పాలకవర్గ అధ్యక్షుడు బాస్కరరావులు మాట్లాడుతూ లూథరన్ సంఘ చర్చి నూరు వసంతాలు పూర్తి చేసుకొందన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకలు, నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులకు ప్రత్యేక క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ గురుమండల అధ్యక్షుడు రత్నాకర్, చర్చి పీసీసీ, ఎల్‌సీసీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పీవీరావుకు ఘన నివాళి



పెంటపాడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాలమహానాడు, జై భీమ్ నాయకులు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లో మాలమహానాడు నాయకులు పీవీ రావు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలలోని జైబీమ్ సభ్యులు, మాలమహానాడు నాయకులు పీవీ రావుకు నివాళులర్పించారు. 19వ వర్ధంతి పురస్కరించుకొని పెంటపాడు బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గెడ్డం అచ్చిబాబు, ఉన్నమట్ల ఏసురత్నం, కొమ్ము చిట్టిబాబు, పాలుమాటి అబిమన్యుడు, ఇసుకపాటి మధు, సంకర ప్రియబాబు, కొల్లి బాబ్జి, చిందాడ సుందర్ కుమార్, మాలమహానాడు, జైబీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అత్తిలి: ఈనెల 28న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

మార్కెట్‌కు క్రిస్మస్ జోష్



గూడెం టౌన్ ఎ. క్లాష్ ఫ్యారిష్ సెంటినరీ చర్చి వద్ద విద్యుత్ లైటింగ్



చర్చి వద్ద స్టార్‌ను తలపిస్తూ ప్రవేశ ద్వారం

- జోరుగా అలంకరణ వస్తువుల విక్రయం
- శాంతాక్లాజ్ డ్రెస్సులు, విద్యుత్ నక్షత్రాలకు గిరాకీ

పెంటపాడు: మండలంలో క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. సెమీక్రిస్మస్, స్ట్రీట్ క్రిస్మస్, సండే క్రిస్మస్ పేరిట ముందస్తు వేడుకలను క్రైస్తవులు ఆనందంగా జరుపుకుంటున్నారు. ఇప్పటికే చర్చిలన్నీ విద్యుద్దీపాల వెలుగులతో ధగధగ మెరిసిపోతున్నాయి. క్రీస్తు అరాధకుల నివాసాలు కూడా క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు, ఇతర ప్రత్యేక సామగ్రితో శోభయమానంగా దర్శనమిస్తున్నాయి. గూడెం పట్టణంలో ఎ. క్లాస్ సెంటినరీ లూథరన్ చర్చి, ముదునూరుపాడు బైబిలుమిషను స్వస్థత శాల, బాదంపూడి బైబిలుమిషను శాల, రాచర్ల రూపాంతర టవర్ చర్చి, గూడెం మథర్‌వన్నిని చర్చి, పాతూరు ఆర్సీఎం చర్చితో పాటు పలు లూథరన్, బాప్టిస్టు, హోప్, సీఎస్ఐ, ఏసన్న మందిరాలు, ఎల్ఎల్ఎం విమోచన మందిరాలు, మరనాత విశ్వాససమాజాలు, క్రైస్తవ విద్యాసంస్థలైన బెస్ట్ కళాశాల, సెంట్ ఆన్స్, సెంట్‌మేరిస్, మథర్‌వన్ని నర్సింగ్ కళాశాల, తదితర ప్రాంతాలలో విద్యుత్ కాంతులు అలరిస్తున్నాయి.

అలంకరణపై దృష్టి

పట్టణంలో పది రోజులు ముందుగానే క్రిస్మస్ సంబరాలు ప్రారంభమయ్యాయి. క్రైస్తవ సోదరులంతా చర్చిలను, తమ ఇళ్లను ఇప్పటికే ప్రత్యేకంగా అలకరించారు. క్రిస్మస్ సంబంధించిన సామగ్రికి మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. పలు స్కూళ్లలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిపేందుకు సిద్ధపడుతున్నారు. ఈ సందర్భంగా పిల్లలతో క్రిస్మస్ తాత(శాంతాక్లజ్)వేషాలు వేయించేందుకు ప్రత్యేక డెస్సులను కొనుగోలు చేస్తున్నారు. పలు దుకాణాల వద్ద విద్యుత్ లైటింగ్ దండలు, క్రిస్మస్ తాత డెకరేషన్‌లు, ఉన్ని దస్తులు, ఎలక్ట్రికల్, కాగితం, పాస్టిక్‌తో తయారు చేసిన స్టోర్స్‌లలో రూ. 50 నుంచి రూ. 3 వేల వరకు అందుబాటులో ఉన్నాయి.

ప్రారంభమైన వేడుకలు

డిసెంబర్ మొదటి వారం నుంచే పలు చర్చిలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. క్రిస్మస్ పర్వదినం సమీపించే కొద్దీ యువత ఆధ్యాత్మిక నాటకాలు, స్కిట్స్ వేసేందుకు, కీర్తనలు ఆలపించేందుకు సన్నాహకాలు చేస్తున్నారు.

క్రిస్మస్ చెట్టు వెలిగింది.. హృదయం ఉప్పొంగింది

క్రిస్మస్ ఎంతో దూరంలో లేదు. క్రిస్మస్ చెట్టును, క్రిస్మత్ తాతను, జనన వృత్తాంతాన్ని తెలిపే నక్షత్రాన్ని, పశువుల పాక తదితర సెట్టింగ్‌లు ఏర్పాటు చేసేందుకు చర్చిలలో యువత ఏర్పాటు ముమ్మరం చేశారు. రంగు రంగుల విద్యుత్ మయంతో మ్యూజిక్‌తో ఉంటే అలంకరణలు, బెత్లహేములో ఉండే వాతావరణంలో కిస్మస్ ట్రీలను తలపించే విద్యుత్ కటౌట్‌లతో సందడి వాతావరణం వచ్చేసింది.





విద్యుత్ కటౌట్‌లు, అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్టార్‌లు

రామానుజన్ గణిత మేధావి



తణుకులో విజేతలైన విద్యార్థులతో హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఏకేటీపీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎం తాళాబత్తుల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు గణిత శాస్త్రంలో పట్టుసాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా గణిత శాస్త్ర ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర ఉపాధ్యాయులు వీరభద్రరావు, ఎస్‌కే కజియా, కె.అరుణ, కె.సునీత, వి.రజనీకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోతిబంతాట కేసులో ఐదుగురు అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: కోతి బంతి ఆడుతున్న స్థావరంపై దాడి చేసి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని పడాల గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డబ్బులు పణంగా పెట్టి కోతి బంతి ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,800లు నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ ప్రసాద్ వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్లోబల్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

అత్తిలి: తన ఉన్నతికి కారణమైన జన్మభూమికి రుణం తీర్చుకునేందుకు గ్లోబల్ ఫౌండేషన్ స్థాపించి ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధి మంతెన యోగేంద్రకుమార్(బాబు) అన్నారు. గ్లోబల్ ఫౌండేషన్ ఐఎన్‌సీ యూఎస్‌ఏ దత్తత తీసుకున్న అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో ఆదివారం భీమవరం వర్మ ఆసుపత్రి వైద్యబృందంచే మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో యోగేంద్రకుమార్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాకు చెందిన భూపతిరాజు పెండేటి అమెరికాలో స్థిరపడి తన సంపాదనలో ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే తలంపుతో గ్లోబల్ ఫౌండేషన్ స్థాపించి రాష్ట్రంలో ఇప్పటి వరకు 35 గ్రామాలను దత్తత తీసుకున్నారన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా దత్తత గ్రామాలలో ప్రజలకు వైద్య శిబిరాలు నిర్వహించి ఆర్థికంగా వెనుకబడిన వారికి వైద్య సేవలు అందించడం, ఆర్వో ప్లాంట్లు నెలకొల్పడం, పర్యావరణ పరిరక్షణ చేపట్టడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ ఫౌండేషన్ ద్వారా గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. వైద్య శిబిరానికి కొమ్మర, పాలూరు, ఈడూరు గ్రామాలనుండి 310 మంది ప్రజలు హాజరైయ్యారు. 190 మందికి ఉచితంగా మందులను అందజేసారు. గుండె సంబంధిత పరీక్షలకు సంబంధించి ఈసీజీ, బీపీ, పరీక్షలు చేసారు. కార్యక్రమంలో గ్లోబల్ ఫౌండేషన్ ఐఎన్‌సీ యూఎస్‌ఏ ప్రతినిధులు నడింపల్లి వెంకట రామరాజు, సీహెచ్ శేఖర్‌రాజు, రుద్రరాజు లక్ష్మీపతిరాజు, మంతెన ధర్మతేజ, ఉపసర్పంచ్ మన్యం దానారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కునాథరాజు శ్రీహరిరాజు, అల్లూరి రామకృష్ణంరాజు, మంతెన గోపాలకృష్ణంరాజు, ముదునూరి బాలకృష్ణంరాజు, వైద్యులు డాక్టర్ యుధిష్టర్ సిరివరపు, డాక్టర్ పి కృష్ణఫణీంద్ర, డాక్టర్ సింధు నారాయణ, డాక్టర్ కె రిందనాయుడు, డాక్టర్ కె సత్యనంద్, డాక్టర్ జి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



కొమ్మరలో ఉచితంగా మందులను అందజేస్తున్న గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు

'అమిత్‌షా వ్యాఖ్యలు ఆక్షేపణీయం'

తణుకు అర్బన్: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం తమ నిరసన తెలియజేశారు. ఇరగవరం రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక నియోజకవర్గ కన్వీనర్ పొట్ల సురేష్ మాట్లాడుతూ తక్షణమే అమిత్ షాని మంత్రి పదవినుంచి తొలగించాలని, అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన మాటలకు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనలకు సంఘీభావం తెలపాలని ఈ విషయంపై దళిత ఐక్యవేదిక మహా ఉద్యమానికి ముందుకు వెళ్లేందుకు దళితులంతా సన్నద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక సభ్యులు పెనుమాల రాజేష్, యలమంచిలి బాలు, పడాల బాలు, పేరూరి రమేష్, ఇరగవరం మండల నాయకులు సుబ్బారావు, చంద్రప్రసాద్, అర్జున్, భావన రాము తదితరులు పాల్గొన్నారు.



తణుకులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సురేష్ తదితరులు

మహిళా చట్టాలపై అవగాహన

ఇరగవరం: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నాల్గువ అదనపు జడ్జి డి.సత్యవతి తెలిపారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇరగవరం మండలానికి చెందిన ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలు, డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులంతా సమన్వయంతో పని చేసి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. మహిళలు న్యాయ సేవా సంస్థల సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కే కృష్ణ సత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, రెండో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఏవి నాగరాజు, నర్సాపురం ఆర్డీఓ దాసిరాజు, సూరంపూడి కామేష్, తహసీల్దార్లు వై.రవికుమార్, ఎంపీడీవో వివిఎస్‌వి శర్మ, ప్రమోదిని కుమారి, ఎస్ఐ సతీష్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తులు

పాత నేరస్తుడి వీరంగం

తణుకు అర్బన్: తణుకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం పాత నేరస్తుడు వీరంగం సృష్టించాడు. ఇరగవరం కాలనీకి చెందిన చోడవరపు సాయి అలియాస్ దొంగ సాయి తన స్నేహితుడు పూజారి విష్ణుతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. గతంలో నమోదైన కేసుకు సంబంధించి శిక్ష అనుభవించి బయటకు వచ్చిన సాయి స్టేషన్‌లో సీఐ, ఎస్సై ఉండగానే మద్యం మత్తులో ఇష్టానుసారంగా ప్రవర్తించాడు. స్టేషన్‌లో తలుపులకు ఉన్న అద్దాలు పగులకొట్టి రికార్డులను చిందరవందరగా పారేసి భయానక పరిస్థితి సృష్టించాడు. పోలీసులు వారించడంతో గాజు ముక్కతో పొడుచుకునేందుకు సిద్ధమయ్యాడు. సాయి, విష్ణును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

తణుకు అర్బన్: తణుకు రోటరీ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్ రోగులు, అనుమానితులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తానరావు (బాబి) సౌజన్యంతో నిర్వహించిన ఈ ఉచిత వైద్యశిబిరంలో గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్యాన్సర్‌తో బాధపడే వారి సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని ఇందులో గుండె పరీక్షలతోపాటు బీపీ, సుగర్ పరీక్షలు కూడా నిర్వహించామని చెప్పారు. భీమవరం ఒమేగా హాస్పిటల్స్ వారి సాంకేతిక సహకారంతో ప్రముఖ క్యాన్సర్, జనరల్ సర్జరీ నిపుణులు డాక్టర్ నాగెళ్ల ప్రదీప్‌కుమార్ రెడ్డి నేతృత్వంలో హాజరైన 53 మందికి వైద్యసేవలు అందజేశారు. పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు అక్కిన కాశీవిశ్వనాథం, డాక్టర్ వి.వెంకటరాజు, బసవ రామకృష్ణ, రెడ్డి రంగారావు, కేటీవీ రెడ్డి, బోడపాటి రామకృష్ణ, గమిని రాంబాబు, వి.హనుమంతరావు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, పోతుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు రోటరీ క్లబ్‌లో వైద్యసేవలందిస్తున్న వైద్యులు

గూడెం రైల్వేస్టేషన్‌కు మహర్దశ



ఒకటో నంబరు ప్లాట్ ఫాం విస్తరణ



ఫుట్ ఓవర్‌బ్రిడ్జి

- గూడెం స్టేషన్‌కు అమృత్ హంగులు
- శరవేగంగా పనులు

తాడేపల్లిగూడెం: వాణిజ్య కేంద్రంగా తాడేపల్లిగూడెం పట్టణం పేరుగాంచింది. ఇక్కడ ఉన్న రైల్వేస్టేషన్ ద్వారా పెద్ద ఎత్తున ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయి. ప్రతిష్టాత్మక ఏపీ నిట్, ఉద్యాన విశ్వవిద్యాలయాలతో పాటు పలు విద్యా సంస్థలు ఇక్కడ కొలువు దీరాయి. ఈ క్రమంలో నిత్యం ఎంతో మంది వ్యాపారం, విద్య కోసం సుదూర ప్రాంతాల నుంచి రైలు మార్గం ద్వారా తాడేపల్లిగూడెం పట్టణం వస్తుంటారు. పలు సూపర్ ఫాస్ట్ రైళ్లకు సైతం ఇక్కడ హాల్ట్ ఇవ్వడంతో ప్రయాణికుల తాకిడి పెరిగింది. వాణిజ్యం, ప్రయాణికుల పరంగా ఇక్కడ డిమాండ్ గ్రహించిన రైల్వే అధికారులు మోడ్రన్ స్టేషన్‌గా ఆధునీకరించడానికి చర్యలు చేపట్టారు. అమృత్ భారత్‌లో భాగంగా రూ.27.13కోట్ల నిధులు కేటాయించారు. ఆయా నిధులుతో ఎస్కోలేటర్, ఏసీ వెయింటింగ్ హాల్, మోడ్రన్ మరుగుదొడ్లు, నడక వంతెన, ప్లాట్‌ఫాం ఆధునీకరణ, మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఇప్పటికే ఆయా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గతంలో వృద్ధులు, అధిక లగేజీ ఉన్నవాళ్లు మెట్లు ఎక్కి స్టేషన్ బయటకు రావాలంటే నానా ఇబ్బందులు పడేవారు. అయితే ఆరేళ్ల కిందట 1,2 ప్లాట్‌ఫారాల్లో లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేశారు. తాజాగా స్టేషన్ ప్రవేశ మార్గం నుంచి నేరుగా ఏలూరు కాలువ గట్టు వరకు నూతన వంతెన నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.



ఎస్కలేటర్ల నిర్మాణం



రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై నిర్మాణాలు

విజయవంతంగా విక్టరీ 3కె రన్

పెంటపాడు: మండలంలోని అలంపురం టీబీఆర్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విక్టరీ 3కె రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. మాజీ సైనిక సంక్షేమసంఘ రాష్ట్ర నాయకుడు భోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్ టీబీఆర్ భవన్ నుంచి అలంపురం సాయిబాబా ఆలయం, కాగులంపాడు, ప్రత్తిపాడు సెంటర్, వై. జంక్షన్ దుర్గమ్మ ఆలయం, సాక్షి కార్యాలయం మీదుగా టీబీఆర్ పోలీస్, డిఫెన్స్ అకాడమీకి చేరుకుంది. ఈ సందర్భంగా భోగేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమంలో భాగంగా అవగాహన కోసం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. 20 మంది యుద్ధవీరులను ఎంపిక చేసి వారిని ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి లెఫ్టినెంట్ జనరల్ కెజీ. కృష్ణ, సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు బ్రిగేడియర్ వెంకటరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి సాయి ప్రసాద్‌రావులతో పాటు, పలువురు ప్రముఖులు, సైనిక ఉద్యోగుల సంఘ నాయకులు, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



విక్టరీ 3కె రన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఇంటింటికీ వైద్యం

తణుకు అర్బన్ : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటికీ వైద్యంలో భాగంగా ప్రముఖ వైద్యులు డాక్టర్ నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వైద్యసేవలందించారు. తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో 5గురి వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఉచిత వైద్యం అందజేశారు. ఆడిటర్ జొన్నలగడ్డ సూర్య సుబ్రహ్మణ్యం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర చౌదరి, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఉచిత వైద్య సేవలు అవసరమైన వారు 90592 90717, 99853 43530 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



తణుకులో వృద్ధులకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ అచ్యుతరామయ్య

సగర సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా 'ఏపూరి'

తాడేపల్లిగూడెం రూరల్: సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని మోదుగ గుంట గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ ఏపూరి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఏలూరులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ ఎన్నిక జరిగిందని సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సగర సంఘం రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘ అభివృద్ధికి పాటుపడతానన్నారు. సగర సామాజికవర్గం అన్ని రంగాల్లోనూ ముందుకు సాగేలా యువకులను ఉత్సాహవంతులను చేస్తానన్నారు. పలువురు ఆయనను అభినందించారు.

